క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల సంఘ భవనంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే వైద్య శిబిరాన్ని పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు.

'శిక్షణ తరగతులు విజయవంతం చేయండి'

భైంసాటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలో ఈనెల 12,13,14 తేదీల్లో నిర్వహించే పీడీఎస్ రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు వాగ్మారె మహేందర్ కోరారు. గురువారం భైంసాలోని డిగ్రీ కళాశాల ఆవరణలో కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నవీన్, రాజారాం, విద్య, అర్చన, తదితరులున్నారు.

'ఆయిల్‌పాం'తో లాభాలు



మాట్లాడుతున్న డీజీఎం రాంమోహన్

తానూరు: ఆయిల్‌పాం సాగుతో రైతులకు లాభాలు ఉంటాయని డీజీఎం రాంమోహన్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పించారు. సాగు విధానం, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. 30 ఏళ్ల పంట ఉంటుందని.. అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చన్నారు. వెంకటేశ్, వైస్ ఎంపీపీ చంద్రకాంత్, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, చంద్రకాంత్, సర్పంచ్ విఠల్, ఏఈవోలు సంఘవి, విష్ణు, అంబాదాస్, ఫీల్డ్ ఆఫీసర్ యోగేశ్ తదితరులున్నారు.

12న సమావేశం

సారంగాపూర్: మండలంలోని కౌట్ల(బి) గ్రామ సమీపంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 12న ఎస్సీ, ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు దళిత సంఘం మండల నాయకుడు దండు సాయన్న ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఎస్సీ,ఎస్టీలు తరలిరావాలని కోరారు. సమావేశంలో మండలశాఖ కమిటీని ఎన్నుకుంటామని పేర్కొన్నారు.

ఆసుపత్రి సందర్శన



వివరాలు అడుగుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం ఎమ్మెల్యే రేఖానాయక్ సందర్శించారు. ఇటీవల ఖానాపూర్ ఆసుపత్రికి డయాలసిస్ కేంద్రం మంజూరవడంతో కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన గదులను పరిశీలించారు. అనంతరం సదర్మాట్ కాలువ మరమ్మతులను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఆసుపత్రి సూపరింటెండెంట్ వంశీమాధవ్, శంకర్, అంకం రాజేందర్, రాము నాయక్, కేహెచ్ ఖాన్ తదితరులున్నారు.

'విమర్శిస్తే ఊరుకోం'

కుంటాల: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సహకారంతోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి పేర్కొన్నారు. మండలంలోని సూర్యాపూర్‌లో ఇటీవల భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్డు, పంటలను పరిశీలించి మాట్లాడారు. కొందరు బీఆర్‌ఎస్ నాయకులు కావాలని ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని.. మానుకోవాలని హెచ్చరించారు. సర్పంచ్‌లు ప్రదీప్‌కుమార్, హైమద్, నాయకులు బుచ్చన్న, అశోక్ రెడ్డి, శివాజీ, హైమద్‌పాషా, రమణ, సదాశివ్‌పటేల్, రాజేందర్, రాజు పాల్గొన్నారు.

జడ్జితో విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

భైంసాటౌన్: మనఊరు– మనబడి పథకంలో అవినీతి జరిగిందని.. దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, జిల్లా కార్యదర్శి అరవింద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి చేపట్టిన సమరభేరి జీపుజాత గురువారం భైంసా చేరుకుంది. బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వారు మాట్లాడారు. పెండింగ్ మెస్ కాస్మొటిక్ చార్జీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు పరమేశ్వర్, రుద్రప్రతాప్ తదితరులు ఉన్నారు.

కూలీలు దొరుకుతలేరు..!

- పత్తి, సోయా తదితర చేన్లలో పెరిగిన కలుపు
- స్థానికంగా దొరకని కూలీలు
- పక్క రాష్ట్రం నుంచి ఆటోల్లో తీసుకొస్తున్న రైతులు



బోరిగాం శివారులో పంటలో పెరిగిన కలుపు



తానూరు మండలం బోల్సా శివారులో పత్తి చేనులో కలుపు తీస్తున్న కూలీలు

తానూరు: జిల్లాలో వ్యవసాయ కూలీల కొరత నెలకొంది. కొద్దిరోజుల కిందట ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా పత్తి, సోయా, మినుము, పెసర వంటి చేన్లలో కలుపుతీత పనులు చేపట్టలేదు. దీంతో ప్రస్తుతం చేన్లలో కలుపు విపరీతంగా పెరిగి.. పంట మొక్కల కంటే ఎత్తు అయింది. దీంతో రైతులు తెల్లవారంగానే కూలీల ఇళ్లకు పరుగులు తీస్తుండటంతో వారికీ డిమాండ్ పెరిగింది. అందరం ఏకకాలంలో కలుపుతీత పనులు చేపడుతుండటంతో కూలీలు దొరకడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

పెరిగిన ఖర్చులు..

గతేడాది కంటే ఈసారి పెట్టుబడులు పెరిగిపోయాయి. సీజన్ ప్రారంభంలో వర్షాలు సరిగా కురువకపోవడంతో విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో భారమైనా రెండోసారి విత్తాల్సి వచ్చింది. ఇటీవల ఏకధాటిగా కురిసిన వర్షాలకు కొన్ని చోట్ల చేన్లు దెబ్బతినగా.. మరికొన్ని చోట్ల పంటలు మునిగిపోయాయి. విత్తనాల ఖర్చుతోపాటు కూలి కూడా పెరిగింది. సమయానికి కలుపు తీయించకుంటే పంట చేతికి రాకుండా పోతుందని.. ఖర్చు ఎక్కువైనా ఇతర ప్రాంతాల నుంచి కూలీలను ఆటోలో తీసుకొచ్చి కలుపు తీయిస్తున్నారు.

కూలీలకు డిమాండ్..

పత్తి, సోయా రైతులందరికీ ఒకేసారి కూలీలు అవసరం ఉండడంతో వారికి డిమాండ్ పెరిగింది. గతంలో కలుపు తీసినందుకు ఒక్కొక్కరికి రూ200 నుంచి రూ.250 వరకు చెల్లించిన రైతులు.. ప్రస్తుతం రూ.300 నుంచి రూ.400 వరకు చెల్లిస్తున్నారు. స్థానికంగా దొరకకపోవడంతో కొందరు రైతులు పక్క రాష్ట్రమైన మహారాష్ట్రలోని కర్కెల్లి, ధర్మాబాద్, భోకర్ నుంచి రప్పిస్తున్నారు. ఆటో కిరాయి రూ.900తో పాటు ఒక్కో కూలీకి రూ.300 కావడంతో ఆర్థికభారం పెరుగుతోందని రైతులు అంటున్నారు.

జిల్లాలో సాగు వివరాలు..

జిల్లాలో వానాకాలంలో 1,43,223 ఎకరాల్లో పత్తి, 1,10,156 ఎకరాల్లో సోయా, 485 ఎకరాల్లో మినుము, 465 ఎకరాల్లో పెసర పంటలను సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కలుపుతీతకు కూలీలు దొరకపోవడంతో గడ్డిని తొలగించేందుకు కలుపు మందులు వాడుతున్నారు. గడ్డి మందు పిచికారీ చేద్దామంటే పత్తి మొక్కలపై పడి దెబ్బతినే ప్రమాదం ఉందని పలువురు రైతులు వెనుకంజ వేస్తున్నారు.

కూలి పెరిగింది..



గతేడాది రూ.200 వరకు ఉన్న కూలి ప్రస్తుతం రూ.350 వరకు పెంచారు. అయినప్పటికీ చేన్లలో కలుపుతీతకు కూలీలు దొరకడం లేదు. పత్తిలో కలుపు ఎక్కువగా ఉండడంతో తప్పనిపరిస్థితుల్లో ఖర్చు ఎక్కువైనా కూలీలను రప్పిస్తున్నాం. – బాలాజీ, బోరిగాం

మహారాష్ట్ర నుంచి వస్తున్నారు



అన్ని పంట చేన్లలో కలుపు బాగా పెరిగింది. స్థానికంగా కూలీ లు దొరకకపోవడంతో మహా రాష్ట్రలోని కర్కెల్లి, ధర్మాబాద్, భోకర్ నుంచి ఆటోల్లో రప్పిస్తున్నాం. కూలి కంటే ఆటో చార్జీలు అధికమవుతున్నాయి. ఆటో కిరాయి రూ.900తోపాటు ఒక్కొక్కరికి రూ.300 చెల్లిస్తున్నాం. – మహేశ్, ఎల్వి

బోదకాలు నివారణ మాత్రలు పంపిణీ



ఖానాపూర్: బాదన్‌కుర్తిలో అందిస్తున్న సిబ్బంది



లోకేశ్వరం: ధర్మోరలో మందులు ఇస్తున్న శారద



బడిలో మాత్ర వేస్తున్న లక్ష్మణచాంద ఎంపీపీ పద్మ



కుంటాల: కల్లూర్‌లో మాత్ర ఇస్తున్న ఏఎన్ఎం

ఖానాపూర్: బోదకాలు(ఫైలేరియా) నివారణ అందరి బాధ్యత అని పెంబి పీహెచ్‌సీ సీహెచ్‌వో మీరాబాయి, బాదన్‌కుర్తి సబ్‌సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ (సీహెచ్‌వో) మనీషా అన్నారు. గురువారం మండలంలోని బాదన్‌కుర్తి, మేడంపల్లి, సుర్జాపూర్, మస్కాపూర్ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి మాత్రలు పంపిణీ చేశారు. ఈనెల 10 నుంచి 12 వరకు బూత్‌స్థాయిల్లో, 13 నుంచి 22 వరకు ఇంటింటికీ నివారణ మందులు అందిస్తారని వారు పేర్కొన్నారు. సర్పంచ్‌లు, పార్శపు శ్రీనివాస్, మహేందర్, వెంకట్‌రాజు, శ్రావణ్ తదితరులున్నారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర పంచాయతీ కార్యాలయ ఆవరణలో బోదకాలు నివారణ మాత్రలను సర్పంచ్ మంద శారద పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంద భాస్కర్, హెల్త్ అసిస్టెంట్ గంగన్న, దేవపాల ఉన్నారు.

కుంటాల: బోదకాలు వ్యాధిని నివారిద్దామని వైద్యురాలు శృతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కల్లూర్‌లో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని శ్రీ గాయత్రి పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. రఘు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దస్తురాబాద్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 42 బూత్‌ల్లో బోదకాలు(ఫైలేరియా) నివారణ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారి కామేశ్వర్, ఆరోగ్యవిస్తరణాధికారి వేణుగోపాల్, సూపర్‌వైజర్ లలిత అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బోదకాలు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యులు శ్రీకాంత్, ప్రత్యూష, ఎంపీపీ అడ్వాల పద్మ, తహసీల్దార్ శ్రీలత ఎంపీడీఓ శేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికే తెలంగాణ ఆదర్శం

- మంత్రి ఐకేరెడ్డి



మామడలో చెక్కు అందిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

మామడ: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో 24 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. మహారాష్ట్ర ప్రజలు తెలంగాణ మోడల్‌ను కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మవద్దని ప్రజలను కోరారు. రాంకిషన్ రెడ్డి, లింగారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, గంగారెడ్డి, సర్పంచులు భూమేశ్వర్, ముత్యంరెడ్డి, హన్మాగౌడ్, గంగాధర్, రాందాస్, అరవింద్‌రావు, నాయకులు భాస్కర్ రావ్, శశికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ ఫిలిం సీడీ ఆవిష్కరణ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ వేణుగోపాలకృష్ణ దర్శకత్వం వహించిన ప్రేమతో నాన్న అనే షార్ట్‌ఫిలిం సీడీ, పోస్టర్‌ను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆవిష్కరించారు. విలువలు, సామాజిక పరిస్థితులు అద్దం పట్టేలా సినిమా రూపొందించామన్నారు. కెమెరామెన్ కృష్ణవర్మ, సురేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలోని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నివాసంలో మండలంలోని చింతల్‌చాందకు చెందిన 25 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేశారు. బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, అడ్వాల రమేశ్, ఉప సర్పంచ్ అశోక్, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	120
వంకాయ	80
బెండకాయ	100
పచ్చిమిర్చి	100
కాకరకాయ	100
బీరకాయ	100
క్యారెట్	140
గోరుచిక్కుడు	80
కొత్తిమీర	120
అల్లం	220
ఎల్లిగడ్డ	200
ఉల్లిగడ్డ	35
ఆలుగడ్డ	40

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : భోళా శంకర్
నారాయణ : జైలర్

సాయిబాబా ఆలయంలో పూజలు



దాతలను సన్మానిస్తున్న జగన్మోహన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం పూజలు నిర్వహించారు. ఆలయ సింగిల్ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం అన్నదాతలుగా నిలిచిన రజిత–నాగనాథ్, వనజ–వెంకటేశ్ దంపతులను ఆలయ చైర్మన్ పూలమాలలతో సన్మానించారు. ప్రాంగణంలో నిర్మించిన కల్యాణ మండపాన్ని అద్దెకు ఇస్తున్నామని.. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాయిదీక్ష సేవా సమితి సభ్యులు ఉప్పుల నందు, జిందం గోవర్ధన్, సోమేశ్, భూషణ్, చౌదరి, శ్రీధర్, రేణుకదాస్ పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఆయా గ్రామాల ప్రజలు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

13న విజయోత్సవ సభ

ఖానాపూర్:పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్లో ఈనెల 13న తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ విజయోత్సవ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీల సంస్కృతి, స్థితిగతులు, సమస్యలపై చర్చ ఉంటుందన్నారు. అనంతరం సభ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో తొడసం శంభు, మేస్రం నాగోరావు, లింబారావు, మోతీరాం, భీంరావు, నాగరాజు, భీంబాయి, లక్ష్మిబాయి, పార్వతి తదితరులున్నారు.

భగీరథ పైపులైన్‌కు లీకేజీ



పొన్కల్ సమీపంలో వృథాగా పోతున్న నీరు

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామ సమీపంలో కమల్‌కోట్ సరఫరా అయ్యే భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నీరంతా వృథాగా పోతుంది. పైపులో మట్టి చేరి నీరు కలుషితమవుతుందని మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ అయేషా

ముధోల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ అయేషా అఫ్రోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముధోల్ మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సభ్యులు తమ గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ముధోల్‌లో ఉర్దూ మీడియం పాఠశాలలో, బాలికల ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఇంగ్లిష్ టీచర్లను భైంసాకు బదిలీ చేయడం సరికాదని.. వెంటనే సదరు పోస్టులను భర్తీ చేయాలని కోఆప్షన్ సభ్యులు ఖాలీద్ సభ దృష్టికి తీసుకొవచ్చారు. ముధోల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ముధోల్ సర్పంచ్ రాజేందర్ పేర్కొన్నారు. గ్రామాల్లో వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేయాలని.. అవసరమైన చోటస్తంభాలను ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేశ్‌బాబు, పశువైద్యాధికారి రాజేశ్, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు కార్మిక సంఘాల ధర్నా



నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు

నిర్మల్‌చైన్‌గేట్: వచ్చే ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించి దేశాన్ని కాపాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నా నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం రెండోరోజు కొనసాగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, స్కీం వర్కర్లను రెగ్యులరైజ్ చేసి బెనిఫిట్స్ కల్పించాలన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రాజన్న మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజమణి, లలిత, జిల్లా కమిటీ సభ్యులు విజయ, గంగామణి భాగ్య, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి రామలక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌చారి, ఎస్ఎన్‌రెడ్డి, పద్మ తదితరులున్నారు.

ముధోల్‌లో తిరంగా ర్యాలీ



ర్యాలీలో పోస్టల్ సిబ్బంది

భైంసా: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా గురువారం పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముధోల్‌లోని వీధుల్లో జాతీయజెండాలతో ర్యాలీ తీశారు. ఈసందర్భంగా భైంసా డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుస్మిత బెనర్జీ మాట్లాడారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. ఈనెల 12 వరకు భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు విక్రయిస్తున్నామని.. 20–30 అంగుళాలు కలిగిన జెండా రూ.25కే అందిస్తున్నామని అన్నారు. ఆన్‌లైన్‌లోనూ జెండాలు కొనవచ్చన్నారు. ఎంఓ నరేశ్, ఎస్పీఎం, బీపీఎం, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

'మేరీ మిట్టి మేరా దేశ్' జయప్రదం చేయాలి

ఖానాపూర్: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఈనెల 15 నుంచి 30 వరకు నిర్వహించే 'మేరి మిట్టి మేరా దేశ్' కార్యక్రమం జయప్రదం చేయాలని కార్యక్రమ నిర్వహణ కమిటీ అసెంబ్లీ కోఆర్డినేటర్ దాదె మల్లయ్య అన్నారు. గురువారం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో పార్టీ అసెంబ్లీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా అమరవీరులను, స్వాతంత్ర్య సమరయోధులను, సైనికుల్ని సన్మానించాలన్నారు. ప్రతి బూత్‌లో 75 మొక్కలు నాటి కార్యక్రమం ప్రారంభించాలన్నారు. బుచ్చన్న, రవీందర్‌రెడ్డి, పరమేశ్వర్‌గౌడ్, లింబాద్రి, రమేశ్ తదితరులున్నారు.

వేతనాలు విడుదల చేయండి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని బీసీ హాస్టళ్లలో పని చేస్తున్న డైలీవెజ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. బీసీ హాస్టళ్లలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ హాస్టళ్లలో డైలీవేజ్ ఔట్‌సోర్సింగ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న 30 మందికి 15 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. గతంలో నాలుగు నెలలకోసారి జీతాలు వచ్చేవని.. ప్రస్తుతం నెలలు గడుస్తున్నా రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ హాస్టల్ వర్కర్స్ సంఘం జిల్లా నాయకులు సుజాత, ఫెరోజ్, ఉపాధ్యక్షుడు రమేశ్, నాగభూషణ్, దేవదాస్, అనురాధ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించి ఆదుకోవాలి

తానూరు: భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి వారికి ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీసీ పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సుంకెట పోశెట్టి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. సర్వే నిర్వహించి న్యాయం చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే టికెట్ బీసీలకు ఇవ్వాలని కోరారు. ఎలాంటి ఆంక్షలు విధించకుండా గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారందరికీ రూ.మూడు లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మారుతి, పి.లక్ష్మారెడ్డి, మాధవ్‌రావ్, ఎల్లప్ప రజక సంఘం నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్‌టీయూ నాయకులు సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఏపీనగర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జిల్లా ప్రధాన కార్యదర్శి బివి రమణారావు మాట్లాడారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కరించకుంటే ఉద్యమ కార్యాచరణ చేపడతామన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బల్సు గజ్జారాం, ప్రధాన కార్యదర్శి గోపాల్, వందన, పి.గజ్జారాం, తదితరులున్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

సారంగాపూర్: పాడిరైతులు తప్పనిసరిగా తమ ఆవులు, గేదెలు, ఎడ్లకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆయన గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. వారి సర్పంచ్ సుజాత, రాజ్‌మహ్మద్, పశు వైద్యాధికారులు ముక్తార్, జమీల్, సిబ్బంది, రైతులు ఉన్నారు.

అనాథల వివరాలు సేకరించాలి

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో 23ఏళ్ల లోపున్న అనాథల పూర్తి వివరాలు సేకరించాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీఓ రహీం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాలు, కళాశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను గుర్తించాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సూచించారు.